
సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం। 4। జూలై। 2024



బోగి..భాగ్యం!
కిక్కిరిసిన బోగీల్లో ప్రయాణం చేసే వారి కష్టాలు తీరనున్నాయి. అన్ని ప్రధాన రైళ్లలో రెండు జనరల్ బోగీల చొప్పున ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. -8లో



ఎర్ర చందనం దుంగలు స్వాధీనం
శేషాచలం అటవీ ప్రాంతంలో అటవీ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.400	రూ.500
రెండోరకం	రూ.300	రూ.380



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1411 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	475	475
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 105.500 కిలోలు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆదేశాల మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష రాయనున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ నిమిత్తం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా సంచాలకులు డాక్టర్ బ్రహ్మయ్య తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉండి టీటీసీ, టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 97031 85382, 98499 19221 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నేటి పీజీ పరీక్ష వాయిదా

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 4వ తేదీన జరగాల్సిన పీజీ 4వ సెమిస్టర్, డిగ్రీ 7వ సెమిస్టర్, ఇంజనీరింగ్, ఎంసీఏ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు యోగివేమన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త బంద్‌నకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు తెలిపారు. వాయిదా పడిన పరీక్షను ఆయా పరీక్షల చివరి పరీక్ష తర్వాత నిర్వహిస్తామని తదనగుణంగా సూచనలను ఆయా కళాశాలలకు పంపించామని పేర్కొన్నారు.

వైవీయూ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు ప్రారంభం


వైవీయూ: యోగివేమన యూనివర్సిటీ, లలిత కళల విభాగం నిర్వహిస్తున్న నృత్యం, కీ బోర్డు, కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్ కోర్సులకు వార్షిక పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షలను అందరికీ అందుబాటులో ఉండేటట్లు శ్రీహరి డిగ్రీ కాలేజ్‌లో నిర్వహిస్తున్నారు. సుమారు 100 మంది పరీక్షకు హాజరు అయ్యారు. ఆ విభాగాధిపతి డాక్టర్. కే. మృత్యుంజయరావు పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి పరీక్ష కేంద్రాన్ని, నిర్వహణ తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసు కొన్నారు.

రైతు బజారును వినియోగంలోకి తేవాలి

రాయచోటి: రాయచోటి పట్టణంలోని రైతు బజారును పూర్తిగా వినియోగంలోకి తేవాలని, ఇందుకు తగిన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. రైతు బజార్ అంశంపై జిల్లా మార్కెటింగ్ అధికారితో కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. రాయచోటిలోని రైతు బజార్‌లో ఖాళీగా ఉన్న షాపులను భర్తీ చేయాలన్నారు. టీ కొట్టు, డ్రై ఫ్రూట్స్, ఆయిల్, విక్రేతలు, టైలరింగ్, జనరల్ షాప్ తదితర వ్యాపారాలు చేసుకునే వారిని రైతు బజార్‌లో షాపులు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అందుకు అనువైన చర్యలు తీసుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ, మున్సిపల్ కమిషనర్‌లకు సూచించారు. ఆసక్తి కల్గిన చిరు వ్యాపారులు ఎవరైనా మాసాపేటలోని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కార్యాలయంలో తమ వివరాలతో దరఖాస్తు సమర్పించవచ్చని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి త్యాగరాజు పేర్కొన్నారు.

ఇదేం దౌర్జన్యం బ్రదర్స్!

- ఫ్లైయాష్ సరఫరా నిలిపేయాలంటూ పోట్లదుర్తి బ్రదర్స్ హుకుం
- ఐసీఎల్, జువారీ సిమెంటు పరిశ్రమలపై కన్నెర్ర చేసిన వైనం
- నెలకు 10వేల టన్నులు ఎంఓయూ ఉన్నా సరఫరా నిలిపివేత
- సిమెంటు పరిశ్రమల్లో మూడు రోజులకు సరిపడా ఫ్లైయాష్ మాత్రమే నిల్వ
- రెండు రోజులుగా ఆర్టీపీపీ ఫ్లైయాష్ కేటాయించకపోవడంతో కర్మాగారాలు విలవిల



రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఇన్‌సెట్) ఫ్లైయాష్

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లాలోని ఆ అన్నదమ్ములు అతి సామాన్యులు. ఇది ఒకప్పటి మాట. సారా వ్యాపారంలో అడుగుపెట్టి దినదినాభివృద్ధి చెందారు. తర్వాత పైరవీల కారణంగా ఊహించని స్థాయికి చేరుకున్నారు. ఇందులో ఒకరికి ఎంపీ స్థాయి హోదా సైతం దరి చేరింది. ఇంకేముంది ప్రకృతి సంపదపై ఒకరు దృష్టి సారిస్తే, మరో సోదరుడు పారిశ్రామికవేత్తలు, వ్యవస్థలను టార్గెట్ చేస్తూ కోట్లాది రూపాయలు లబ్ధిపొందే దిశగా అడుగులు వేస్తున్నారు. వెరసి ఆర్టీపీపీపై కర్రపెత్తనం కొనసాగిస్తున్నారు. యర్రగుంట్ల కేంద్రంగా ఉన్న సిమెంటు పరిశ్రమలకు ఎంఓయూ ఉన్నా, ఫ్లైయాష్ సరఫరా నిరాకరించాలని హుకుం జారీ చేశారు. తలాడించే పనిలో ఆర్టీపీపీ యంత్రాంగం ఉండిపోయింది.

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు నుంచి ఉత్పన్నమయ్యే ఫ్లైయాష్ సిమెంటు పరిశ్రమలతో పాటు చిన్నతరహా పరిశ్రమలకు కేటాయించనున్నారు. ఆ మేరకు నెలకు 5వేల టన్నుల చొప్పున జువారీ, ఐసీఎల్ పరిశ్రమలకు కేటాయించేలా ఎంఓయూ ఉంది. ఆయా పరిశ్రమలు ప్రారంభం నాటి నుంచి ఫ్లైయాష్ సరఫరా క్రమం తప్పకుండా అవుతోంది. తాజాగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐసీఎల్, జువారీ సిమెంటు పరిశ్రమలపై పోట్లదుర్తి బ్రదర్స్ కన్నెర్ర చేశారు. ఫ్లైయాష్ సరఫరా చేయరాదని ఆర్టీపీపీ యంత్రాంగాన్ని ఆదేశించారు. అంతే ఆర్టీపీపీ యంత్రాంగం తలూపింది. రెండు రోజులుగా ఫ్లైయాష్ సరఫరా నిలిచిపోయింది. సిమెంటు కార్మాగారంలో కేవలం మూడు రోజులకు సరిపడా ఫ్లైయాష్‌ను మాత్రమే నిల్వ చేసుకునేవారు. రెండు రోజులుగా సరఫరా లేకపోవడంతో ఐసీఎల్, జువారీ పరిశ్రమలల్లో ఫ్లైయాష్ నిల్వలు తరిగిపోయినట్లు సమాచారం.

ప్రభుత్వ పెద్దల దృష్టికి వ్యవహారం

యర్రగుంట్ల ఐసీఎల్, జువారీ పరిశ్రమలకు ఆర్టీపీపీ నుంచి ఫ్లైయాష్ నిలిపేయడాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు తీసుకెళ్లినట్లు సమాచారం. పోట్లదుర్తి బ్రదర్స్ అనవసర పెత్తనం, ఎప్పటి నుంచో సరఫరా అవుతోన్న ఫ్లైయాష్ నిలిపివేతపై సిమెంటు పరిశ్రమల యాజమాన్యాలు సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. అదే విషయాన్ని టీడీపీ ప్రభుత్వంలో కీలక నేత దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. వెంటనే స్పందించిన ఆయన జెన్‌కో యంత్రాంగంతో మాట్లాడి వెంటనే ఫ్లైయాష్ సరఫరా చేయాల్సిందిగా ఆదేశించినట్లు సమాచారం. కాగా ఇదే విషయమై ఆర్టీపీపీ సీఈ గౌరీపతిని 'సాక్షి ప్రతినిధి' సంప్రదించగా, అనధికార ఉత్తర్వుల మేరకు రెండురోజులుగా ఫ్లైయాష్ సరఫరా నిలిపివేసిన విషయం వాస్తవమేనని, తిరిగి పునరిద్ధరించనున్నట్లు స్పష్టం చేశారు.



పోట్లదుర్తి బ్రదర్స్‌తో మాట్లాడుకోండి....

ఎంఓయూ మేరకు ఫ్లైయాష్ కేటాయింపులు ఇవ్వాలి కదా? ఎందుకు ఇవ్వరంటూ ఆయా సిమెంటు పరిశ్రమల ప్రతినిధులు ఆర్టీపీపీ యంత్రాంగాన్ని నిలదీశారు. 'మేం ఏమీ చేయలేం, మీరెళ్లి పోట్లదుర్తి బ్రదర్స్'తో మాట్లాడుకోండని ఉచిత సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. అదేంటీ ఎప్పుడూ లేని సంస్కృతి ఇప్పుడెందుకని అడిగినా చలనం లేనట్లు సమాచారం. అనధికార ఆదేశాలు మేరకు నిలిపేయాల్సి వచ్చిందని పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులకు వివరించినట్లు సమాచారం. కాగా ఇదివరకూ 2014-19 టీడీపీ ప్రభుత్వ హాయాంలో కూడా ఆర్టీపీపీ కేంద్రంగా దోపిడీ పర్వాన్ని తెరలేపారు. అనధికార గేట్ ఏర్పాటు చేసుకొని ఇనుము (స్క్రాప్), సిమెంటు, కంకర యధేచ్ఛగా తరలించారు. అప్పట్లో జెన్‌కో డైరెక్టర్లుకు చోద్యం చూడడం మినహా కట్టడి చేయలేని దుస్థితి. 6వ యూనిట్ నిర్మాణ పనుల నేపథ్యంలో వాహనాలు రాకపోకలకు అనధికార గేట్ ఏర్పాటు చేసినట్లు అప్పట్లో యంత్రాంగం సమర్థించుకుంది.

ప్రయోగ పద్ధతిలో బోధన చేయండి: ఆర్జేడీ



మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్: రీజియన్ లెవెల్ అటల్ ల్యాబ్‌ల వర్క్‌షాప్ మాసాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం ప్రారంభమైనది. ఈ కార్యక్రమాన్ని కడప ఆర్జేడీ రాఘవరెడ్డి, అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ రాఘవరెడ్డి మాట్లాడుతూ మూసపోసిన బోధన విధానానికి స్వస్తి పలకాలని, ప్రయోగాలు నిర్వహిస్తూ బోధన జరపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఉపయోగించుకొని విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలను పెంపొందింపజేస్తూ, నూతన ఆవిష్కరణలను రూపొందించాలన్నారు. అన్ని పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాలను ఉపయోగించుకొని విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలని తెలిపారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని తద్వారా భావి శాస్త్రవేత్తలను తయారు చేయాలని ఆయన సూచించారు. అన్నమయ్య జిల్లా డీఈఓ శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ రాయలసీమ పరిధిలోని 10 జిల్లాల జిల్లా సైన్స్ అధికారులకు హబ్ ఏటీఎల్ ప్రధానోపాధ్యాయులకు, ఇన్‌చార్జి టీచర్లకు నేటి నుంచి మూడు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లా నుంచి ఒక హబ్ అటల్ టింకరింగ్ ల్యాబ్ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహింపజేసేలా చేయడం ఈ వర్క్‌షాప్ ఉద్దేశం అని అన్నారు. యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఏఎంఓ సమీవుల్లా, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, నోడల్ టీచర్ ఆంజనేయులు, గ్రేటర్ రాయలసీమ 10 జిల్లాల నుంచి హబ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అట్టుడికిన ఎన్‌సీసీ బెటాలియన్



కడప 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎన్‌సీసీ కేడెట్స్

- బైఠాయించిన ఎన్‌సీసీ కేడెట్స్, విద్యార్థులు

వైవీయూ: కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లోని 30 ఆంధ్రా బెటాలియన్‌ను తిరుపతికి తరలించడాన్ని నిరసిస్తూ ఎన్‌సీసీ కేడెట్స్, విద్యార్థులు, విద్యార్థిసంఘాల నాయకుల చేపట్టిన ఆందోళనతో బెటాలియన్ అట్టుడికింది. బుధవారం కడప నుంచి తెలుగుగంగకాలనీలోని 30 ఆంధ్రా బెటాలియన్‌కు ఎన్‌సీసీ కేడెట్స్ చేరుకుని పరిపాలన భవనం వద్ద బైఠాయించారు. అప్పటికే బెటాలియన్‌కు సంబంధించిన సామగ్రిని తరలించేందుకు ఆర్మీ వాహనాలను సిద్ధంగా ఉంచడంతో ఎన్‌సీసీ కేడెట్స్ రోడ్డుకు అడ్డంగా బైఠాయించి నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనలో భాగస్వాములయ్యా రు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆ ఫీసర్ అశోక్, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి, యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు మా ట్లాడుతూ కడపలో 40 ఏళ్ల క్రితం ఏర్పాటైన 30 ఆంధ్రా బెటాలియన్‌ను ఇప్పుడు తిరుపతి గ్రూప్‌కు అ టాచ్ చేయడం ఏంటని ప్రశ్నించారు.ప్రవేశాలు నిలిపేస్తే ఈ యేడాది 2వేల మంది కేడెట్స్ ఎన్‌సీసీలో చేరే అవకాశాన్ని కోల్పోతున్నారన్నారు. ఎన్‌సీసీ బెటాలి యన్ తరలింపు ఆలోచన విరమించుకోవాలని కోరా రు. అనంతరం ఎన్‌సీసీ బెటాలియన్ కార్యాలయంలో కి వెళ్లి సూపరింటెండెంట్‌లు సరస్వతి, డేవిడ్‌లను క లిసి తరలింపు ఆలోచన విరమించుకోవాలని విన్నవించారు.

వైవీయూలో డిగ్రీ కోర్సులు ప్రారంభం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో 2024-25విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య కె. కృష్ణారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ)- 2020ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయడంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ (హానర్స్) ఫిజిక్స్, కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్స్ కోర్సులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. మేజర్ సబ్జెక్టులుగా బీకాం కంప్యూటర్స్ కోర్సులో 60 సీట్లు, ఫిజిక్స్‌లో 30, కెమిస్ట్రీలో 40 సీట్లు చొప్పున ప్రవేశాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులు ఈ కోర్సులు చదవడం ద్వారా భవిష్యత్తు-ఆధారిత విద్య లభించడంతోపాటు ఎంచుకున్న రంగంలో లోతైన నైపుణ్యాన్ని గడిస్తారన్నారు. తద్వారా గ్రాడ్యుయేట్‌లను జాబ్ మార్కెట్ కు సరిపడా జ్ఞానము, స్కిల్ పొంది సమాజ భవిష్యత్తు అవసరాలు తీర్చగల యొక్క పౌరులుగా తయారవుతారన్నారు.

సాగని పనులు.. తగ్గిన ఆదాయం



ఆగిపోయిన విండ్‌ఫాల్ భవన పనులు

- హార్సిలీహిల్స్ టూరిజం ఆదాయానికి గండి
- రూ.9.13 కోట్లతో పర్యాటక అతిథి గృహాల ఆధునీకరణ
- కొత్తగా రెస్టారెంట్ భవన నిర్మాణాలు
- 18 అతిథిగృహాలు కాంట్రాక్టర్‌కు అప్పగింత

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ టూరిజం యూనిట్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం ఫలితంగా ఆదాయంపై తీవ్ర ప్రభావం పడుతోంది. అతిథిగృహాల ఆధునికీకరణ, కొత్త నిర్మాణాల కోసం పనులను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే గోడలు పడగొట్టడం, ఫర్నిచర్ తొలగించడం వరకే పనులు పరిమితమయ్యాయి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హార్సిలీహిల్స్ టూరిజం యూనిట్ అభివృద్ధికి నిర్ణయించారు. 54 అతిథి గృహాలుండగా అందులో గవర్నర్ బంగ్లాను మినహాయించి మిగిలిన వాటిని ఆధునికీకరించడంతోపాటు రంగులు వేయించే పనులు, కొత్తగా రెస్టారెంట్ భవనం నిర్మాణం కలుపుకుని టెండర్లు నిర్వహించారు. ఈ పనులను హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ రూ.9.13 కోట్లతో దక్కించుకున్నారు. తర్వాత పర్యాటకశాఖ ఏప్రిల్ నుంచి డిసెంబర్‌లోపు 9 నెలల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుంది. దీనికోసం పర్యాటకశాఖ కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు వీలుగా తొలి విడతలో వైల్డ్ విండ్స్ భవనంలోని 8, విండ్ విస్టిల్ భవనంలోని 6, విండ్‌ఫాల్ భవనంలోని 4 అతిథి గృహాలను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఈ 18 అతిథిగృహాలను ఏప్రిల్ నెల నుంచి పర్యాటకులకు కేటాయించడం లేదు. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సత్వరమే పనులు పూర్తి చేయకుండా జాప్యం చేస్తున్నారు.

రూ.18 లక్షల నష్టం

ఏప్రిల్ నుంచి 18 అతిథి గృహాలను పనుల కోసం కాంట్రాక్టర్‌కు అప్పగించగా, వాటిని పర్యాటకులకు అద్దెకు ఇవ్వడం లేదు. దీంతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పర్యాటకశాఖకు రూ.18,07,759 ఆదాయం తగ్గింది. ఇది గత ఏడాది మూడు నెలలకు వచ్చిన ఆదాయంతో పోల్చితే, అలా కాకుండా ప్రస్తుత రద్దీ మేరకు లెక్కిస్తే ఆదాయం తగ్గినట్టు. దీనిపై పర్యాటకశాఖ అధికారులు సత్వరమే పనులు పూర్తి చేయించేలా కృషి చేస్తే అతిథి గృహాలు వినియోగంలోకి వచ్చి ఆదాయం పెరుగుతుంది. లేనిపక్షంలో ఆదాయం ఇంకా తగ్గిపోతుంది. ఈ విషయమై పర్యాటకశాఖ సాంకేతిక అధికారులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై నోటీసులు జారీ చేశామని చెప్పారు. పనులు వెంటనే పూర్తయ్యేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తగ్గిన ఆదాయ వివరాలు

నెల	2023	2024	తగ్గింది
ఏప్రిల్	రూ.33,66,062	రూ.22,39,036	రూ.8,27,026
మే	రూ.36,70,175	రూ.30,00,626	రూ.6,69,549
జూన్	రూ.28,49,969	రూ.25,38,785	రూ.3,11,184


గోడలు పడగొట్టి..

అతిథి గృహాల్లో సుందరీకరణ, ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఉన్న భవనాలను అలాగే ఉంచుతారు. అయితే పనుల కోసం కాంట్రాక్టర్ గదుల్లోని వాష్‌రూమ్‌ల గోడలను పడగొట్టారు. కిటికీలు, ఫర్నిచర్ తొలగించారు. ఎలక్ట్రికల్ పనుల కోసం పాతవాటిని తీసేశారు. తర్వాత పనులు చేపట్టాల్సి ఉండగా ముందుకు సాగడం లేదు. ఏప్రిల్ నెల నుంచి పనులు చేపట్టగా మందకొడిగా సాగుతుండటంతో ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మూడునెలలు ముగిసినా 10 శాతం పనులు పూర్తి చేయలేదు. పర్యవేక్షణ చేయాల్సిన సాంకేతిక అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని తెలిసింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. తక్షణమే పనులపై సమీక్షించి చర్యలు తీసుకోని పక్షంలో పర్యాటకశాఖ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.



యాత్రీనివాస్ భవనంలో గోడలు పడగొట్టి వదిలేశారు

తరగతి గది.. విజ్ఞాన నిధి



- టీచ్ టూల్‌తో మెరుగైన బోధన
- జిల్లాలో 375 మందికి శిక్షణ
- ప్రారంభమైన ట్రైనింగ్

మదనపల్లె సిటీ: తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాల మెరుగుదలకు రాష్ట్ర విద్యాశాఖ అచరణాత్మక ప్రణాళికతో ముందుకెళ్తోంది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ), సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో టీచ్ టూల్ పేరుతో ప్రధానోపాధ్యాయులు , స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ, సీఆర్‌ఎంటీలకు టీచ్ టూల్ అబ్జర్వేషన్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. టీచ్ టూల్ ద్వారా ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను అధ్యయనం చేయనున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయ వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పర్చేందుకు ..అదే సమయంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఎస్‌సీఈఆర్‌టీ పలు రకాల పద్ధతులను అధ్యయనం చేస్తోంది. టీచింగ్ సామర్థ్యాలు ఎలా ఉన్నాయి? టీచర్‌కు, విద్యార్థికి మధ్య సంబంధాన్ని తెలుసుకునేందుకు టీచ్ టూల్ అబ్జర్వేషన్స్ ఉపయోగపడుతున్నాయి. పరిశీలనాంశాలను డిజిటల్ బేస్డ్‌గా యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రపంచ స్థాయి బోధనా పద్ధతులపై మాస్టర్ ట్రెనీలు అవగాహన కల్పించనున్నారు.

ప్రారంభమైన శిక్షణా కార్యక్రమాలు:

జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట విద్యాశాఖ డివిజన్‌ల పరిధిలో సోమవారం నుంచి ఈనెల 10వతేదీ వరకు శిక్షణ ఇస్తారు. ఒక్కో బ్యాచ్‌లో 45 మందికి తొమ్మిది రోజుల పాటు శిక్షణ ఇస్తారు. సర్టిఫైడ్ అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలనా సమయంలో బిహేవియర్స్ స్కిల్స్ ఎలా ఉంటాయి? తదితర విషయాలపై శిక్షణ పొందనున్నారు. శిక్షణ అనంతరం అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలించిన ఫీడ్‌బ్యాక్‌ను తీసుకుని యాప్‌లో నమోదు చేస్తారు. నమోదైన అంశాలు యాప్ ద్వారా గుర్తించి, టీచింగ్‌లోని లోటుపాట్లను సరిచేందుకు ఎస్‌సీఈఆర్‌టీ, లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ (ఎల్‌ఎఫ్‌ఈ)తో కలిసి సంయుక్తంగా టీచర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ (టీపీడీ) కోర్సులు తయారు చేసి టీచర్స్‌కు శిక్షణ ఇస్తారు.



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

డివిజన్ల వారీగా ఎంపికైన అబ్జర్వర్స్

మదనపల్లె డివిజన్	200
రాయచోటి	108
రాజంపేట	67



రాష్ట్ర విద్యాశాఖతో పాటుగా లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

గుణాత్మక విద్యను అభివృద్ధి చేసేందుకు

ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ క్వాలిటీ లెర్నింగ్ (గుణాత్మక విద్య) లక్ష్యంగా సాల్ట్ ప్రొగామ్‌ను రూపొందించారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు ఎలా ఉన్నాయి? విద్యార్థి స్థాయికి వెళ్లి బోధన చేస్తున్నారా? ఉపాధ్యాయుడి బోధనను విద్యార్థులు ఏ విధంగా రిసీవ్ చేసుకుంటున్నారు? ఉపాధ్యాయుడు బోధనలో 21వ శతాబ్దపు నైపుణ్యాలను అమలు చేస్తున్నారా? లేదా? తదితర విషయాలను టీచ్ టూల్ ద్వారా సర్టిఫైడ్ అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలన చేస్తున్నారు.

ఇది మేలైన అంశం



విద్యా ప్రమాణాలను పెంపుదలకు టీచ్ టూల్ ప్రోగ్రామ్ మేలైన అంశంగా చెప్పుకోవచ్చు. రెండు దశల్లో ఉపాధ్యాయులకు టీచ్ టూల్ అబ్జర్వేషన్స్‌పై శిక్షణ ఇస్తున్నాం.
–శివప్రకాష్‌రెడ్డి, డిఈఓ

బోధనా పద్ధతులు మెరుగుదల



విద్యార్థికి, ఉపాధ్యాయుడికి మధ్య ఉన్న అభ్యసన పద్ధతుల్లో ఉన్న గ్యాప్‌ను పూడ్చడానికి టీచ్ టూల్ అబ్జర్వేషన్ చక్కని సాధనం. ఉపాధ్యాయుడు వృత్తి నైపుణ్యాల మెరుగుదలకు ఉపకరించే విధంగా టీచ్ టూల్ రూపొందించడం జరిగింది.
–కరుణాకర్, మొబిలైజేషన్ అధికారి,సమగ్రశిక్ష, రాయచోటి

క్లుప్తంగా

మహిళపై టీడీపీ నేత అత్యాచార యత్నం


బాధితురాలు నాగరత్నమ్మ

వీరబల్లి : వీరబల్లి మండలం ఓదివీడు పంచాయతీలోని దూళ్ల హరిజనవాడకు చెందిన టీడీపీ నేత పెద్దరెడ్డయ్య అదే గ్రామానికి చెందిన నాగరత్నమ్మ అనే మహిళపై బుధవారం అత్యాచారయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపారు. వీరిద్దరు గత కొన్ని రోజుల నుంచి భూమి విషయంపై తగాదాలు పడుతూ ఉండేవారు. వివరాలు.. నాగరత్నమ్మ ఒంటరిగా ఉండటం గమనించి బాత్‌రూమ్ వెళ్లిన సమయంలో పెద్దరెడ్డయ్య అక్కడికి వెళ్లి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని స్థానిక ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లగా అక్కడ న్యాయం జరగక పోవడంతో మనస్థాపానికి గురై విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన బంధువులు వెంటనే రాయచోటి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గ్రామాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తల దౌర్జన్యాలు అధికమవుతున్నాయని, వారి ఆగడాలకు అంతులేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు.

పది మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చిన్న కొత్తపల్లి గ్రామానికి చెందిన పదిమందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు బుధవారం ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఆయన కథనం మేరకు మంగళవారం రాత్రి ఒంటిమిట్ట నుంచి చిన్నకొత్తపల్లికి బైక్‌లో వెళ్తున్న తిప్పన జయరామయ్య(45)ను కొత్తపల్లి సబ్ స్టేషన్ వద్ద వర్ధన్ (22) అనే యువకుడు బైక్‌తో ఢీ కొట్టాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో వర్ధన్ తనతోపాటు మరో 9 మందిని అదేరోజు రాత్రి జయరామయ్య ఇంటికి తీసుకెళ్లి దౌర్జన్యం చేసి ఇంటిలో ఉన్న జయరామయ్యను, ఆయన భార్యను కులం పేరుతో దూషించి, రాడ్డుతో దాడి చేయగా జయరామయ్య తలకు గాయమైంది. గాయపడిన వ్యక్తిని కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌లో వర్ధన్, అతనికి సహకరించిన మరో తొమ్మిది మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి

మదనపల్లె : మద్యం మత్తులో ద్విచక్రవాహనంపై వస్తు మరో వాహనాన్ని తప్పించబోయి వాహనం అదుపుతప్పి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. సిద్దవరం పంచాయతీ గాజుల వారిపల్లెకి చెందిన లక్షుమయ్య కుమారుడు మధుకర్ (59) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. వ్యక్తిగత పనులపై పెద్దమండ్యం వెళ్లాడు. అక్కడ మద్యం సేవించి ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో కలిచెర్ల సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయు చెట్టుకు ఢీ కొని కిందపడ్డాడు. గమనించిన స్థానికులు108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో అత్యవసర విభాగంలో వైద్యులు చికిత్స అందించినా ఉపయోగం లేకపోవడంతో మృతి చెందాడు. ఈ ప్రమాద సంఘటనపై పెద్దమండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోగి.. భాగ్యం!

- ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో అదనంగా 2 జనరల్ బోగీలు
- ప్రణాళికలను సిద్ధం చేస్తున్న రైల్వేబోర్డు
- సాధారణ ప్రయాణికులకు భారీ ఊరట


జనరల్ బోగీలో కిక్కిరిసిన ప్రయాణికులు

రాజంపేట : కిక్కిరిసిన బోగీల్లో ప్రయాణం చేసే సాధారణ రైలు ప్రయాణికుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. అన్ని ప్రధాన రైళ్లలో రెండు జనరల్ బోగీల చొప్పున అదనంగా ఏర్పాటు చేసేందుకు రైల్వేబోర్డు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రెండు సాధారణ బోగీలు మాత్రమే ఉన్న ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు రైళ్లలో మరో రెండు బోగీలు అదనంగా ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు సామాన్య ప్రయాణికులకు ఎలాంటి సదుపాయాలు లేని రైళ్లలో ఇవి అందుబాటులోకి రానున్నాయి. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల మధ్య ప్రతి రోజూ రాకపోకలు సాగిస్తున్న లక్షలాది మంది సామాన్య ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైల్వేబోర్డు అదనపు బోగీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 60 రైళ్లకు..

జనరల్ బోగీల కొరత వల్ల మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోధికులైన ప్రయాణికులు పడుతున్న బాధలపై పలు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా ఉద్యమాన్ని చేపట్టారు. కాలు మోపేందుకు కూడా చోటులేని బోగీలలో ప్రయాణం చేసే క్రమంలో తరచూ ప్రమాదాలకు గురైన ఉదంతాలను కూడా సోషల్ మీడియా ఎత్తి చూపింది. దీంతో సాధారణ ప్రయాణికుల ఇక్కట్లను తొలగించే దిశగా దేశ వ్యాప్తంగా సుమారు 80 ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో 2 బోగీలు చొప్పున అదనంగా ఏర్పాటు చేయాలని రైల్వేబోర్డు నిర్ణయించింది. దక్షిణమధ్య రైల్వే పరిధిలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు (లింక్ హాఫ్‌మెన్‌బుష్) ఉన్న సుమారు 60 రైళ్లలో అదనపు బోగీలను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ముంబయి–చెన్నై కారిడార్ మధ్య రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనుంది.

నరకప్రాయంగా మారడంతో...

ముంబయి–చెన్నై రైలుమార్గంలో నడిచే ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లు రద్దీగా నడుస్తున్నాయి. ముంబయి–చెన్నై మధ్య నడిచే మెయిల్, సూపర్‌ఫాస్ట్, చెన్నై ఎగ్మోర్ లాంటి రైళ్ల జనరల్‌బోగీలు కిక్కిరిసి పోతుంటాయి. రైలు మొదలయ్యే స్టేషన్ నుంచి ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉండటంతో ఈ బోగీలలో కాలు మోపేందుకు వీలులేని పరిస్థితులు ఉన్నాయి. ముంబయి–కన్యాకుమారి మధ్య నడిచే జయంతి ఎక్స్‌ప్రెస్ అయితే జనరల్‌బోగీలో ప్రయాణికులు కనీసం నిలబడేందుకు కూడా చోటు ఉండదు. కేరళ నుంచి తిరుపతి, రాజంపేట, నందలూరు, కడప, ఎర్రగుంట్ల మీదుగా నడిచే ఏకైక రైలు జయంతి కావడంతో ఈ రైలులో సాధారణ ప్రయాణికులు అధికంగా ఉంటారు. వేలాడుతూ ఫుట్‌బోర్డు ప్రయాణం చేసి అనేక మంది ప్రమాదం బారిన పడిన ఉదంతాలు ఉన్నాయి. గంటల తరబడి టాయిలెట్లలో నిల్చుని ప్రయాణం చేస్తున్నారు. మరోవైపు దసరా, దీపావళి, సంక్రాంతి పండుగ రోజుల్లో, వేసవి రోజుల్లో ఏపీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సైతం సాధారణ బోగీల్లో నరకం చవిచూస్తూనే ఉన్నారు.

ఎల్‌హెచ్‌బీ కోచ్‌రైళ్లకు మాత్రమే..

ప్రమాదాల నియంత్రణలో భాగంగా జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు కలిగిన రైళ్లలోనే అదనపు బోగీలు ఏర్పాటు కానున్నాయి. ఐసీఎఫ్(ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) బోగీలు ఉన్న రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు సాధ్యం కాదని రైల్వే వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం అన్ని ఎల్‌హెచ్‌బీ బోగీలనే వినియోగంలోకి తెస్తున్నందువల్ల దేశంలో 800 ఎల్‌హెచ్‌బీ రైళ్లకు బోగీలను పెంచాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్‌హెచ్‌బీ కోచ్ రైళ్లకు ఇప్పటికే రెండు బోగీలు ఉంటే మరో రెండు బోగీలను అదనంగా ఏర్పాటు చేయనున్నారు. దీంతో వాటి సంఖ్య నాలుగుకు పెరగనుంది.

అదనపు బోగీల అవసరాన్ని ఇప్పటికైనా కేంద్రం గుర్తించింది



ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు అదనపు బోగీల అవసరాన్ని ఇప్పటికై నా కేంద్రం గుర్తించడం శుభ పరిణామం. ఉన్న ఒక్క బోగీలో ప్రయాణికులు కిక్కిరిసి ఉంటున్నారు. ఇక మార్గమధ్యంలో రైలు ఎక్కే వారి పరిస్థితి వర్ణనాతీతం. అదనపు బోగీల వల్ల పేద, మధ్య తరగతి ప్రయాణికులకు ఊరట లభించనుంది.

– అరిగె మణి, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, నందలూరు

పేద, మధ్యతరగతి ప్రయాణికులకు సేవలందించాలి



అధికంగా పేద, మధ్యతరగతి ప్రయాణికులు తమ గమ్యాలకు చేరుకునేందుకు రైలు ప్రయాణానికి పెద్దపీట వేస్తారు. అలాంటప్పుడు వారిని దృష్టిలో ఉంచుకుని రైలు ప్రయాణ సౌకర్యాలు కల్పించాలి. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ఇంజిన్ వెనుక, గార్డు బ్రేక్ ముందు జనరల్‌బోగీలు అదనంగా ఉంటే ఇబ్బందులు పడరు. జనరల్ బోగీలలో లైటింగ్, ఫ్యాన్, వాటర్ సౌకర్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలి

– పిల్లి పిచ్చయ్య, అధ్యక్షుడు, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, రాజంపేట

దాడి సంఘటనలో కేసు నమోదు

కలకడ : దివ్యాంగురాలిపై దాడిచేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు... మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీ బొంతలవారిపల్లెకు చెందిన సామికారి బాబు భార్య దేవిని ఎనుగొండపాళ్యం పంచాయతీ గుండావాండ్లపల్లెకు చెందిన వీరనాగప్ప నాయుడు, అతని భార్య కాంతమ్మ, అతని తమ్ముని కుమారుడు నాగేశ్వరరావు కలిసి దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైకుల దొంగ అరెస్టు


పోలీసుల అదుపులో బైకుల దొంగ, స్వాధీనం చేసుకున్న బైకులు

రాయచోటి టౌన్ : బైకుల దొంగను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 14 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి సీఐ చంద్రశేఖర్ తెలిపారు. అర్బన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. మంగళవారం ఉదయం రాయచోటి పట్టణ శివార్లలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలం గోనుపోతులవారిపల్లె తాండాకు చెందిన బుక్కె అశోక్ నాయక్ (అలియాస్ కుమార్ నాయక్) బైకుపై వస్తుండగా ఆపి రికార్డులు అడిగారు. అతను లేవని చెప్పడంతో మరింత లోతుగా విచారించగా గతంలో అనేక ప్రాంతాలలో బైకుల దొంగతనాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో అతనిచ్చిన సమాచారం మేరకు అతని ఇంటి వద్ద ఉన్న 14 బైకులను స్వాధీనం చేసుకున్నారు. వీటిని రాయచోటి. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు. తిరుపతి తదితర ప్రాంతాలలో చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితుడు గతంలో 21 బైకులను దొంగిలించిన కేసుకు సంబంధించి జైలు శిక్ష అనుభవించి వచ్చాడు. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాల్లో ఆరు హీరో హోండా, ఏడు హోండా కంపెనీకి చెందినవి, ఒకటి బజాజ్ సీటీ 100 ఉన్నాయని తెలిపారు. వీటిని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ వివరించారు. ఈ దాడులలో ఎస్ఐ భక్తవత్సలం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు, రాజంపేటలో రైళ్ల హాల్టింగ్ సమస్యపై దృష్టి

రైల్వే సహాయమంత్రి సోమన్నతో మేడా భేటీ

రాజంపేట : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంతో పాటు పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో రైళ్ల హాల్టింగ్ లేకపోయిన అంశంపై రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి దృష్టి సారించారు. ఈమేరకు బుధవారం రైల్వేశాఖ సహాయమంత్రి వి.సోమన్నతో ఆయన భేటీ అయ్యారు. లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు జరుగుతున్న క్రమంలో రైల్వే సహాయమంత్రిని ఆయన చాంబరులో కలిశారు. ప్రధానంగా నందలూరు, రాజంపేట రైల్వేస్టేషన్లలో ఆగని రైళ్ల గురించి వివరించారు. దీనిపై మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారు. కచ్చితంగా హాల్టింగ్ ఇచ్చేందుకు అవసరమైన వివరాలను రైల్వే బోర్డు ద్వారా తెప్పించుకుంటానని తెలిపారు.

నందలూరులో హాల్టింగ్ కోరిన రైళ్లు ఇవే..

- తిరుపతి–కాచిగూడ మధ్య నడిచే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ (1279/98)
- ముంబయి–చెన్నై మధ్య నడిచే మెయిల్ ఎక్స్‌ప్రెస్ (22159/60)
- కన్యాకుమారి–ముంబయి మధ్య నడిచే జయంతి ఎక్స్‌ప్రెస్ (16381/82)

రాజంపేటలో హాల్టింగ్ కోరిన రైళ్లు ఇవే..

- న్యూఢిల్లీ–తిరుపతి మధ్య నడిచే ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్(1270/08)
- తిరుపతి–కొల్హాపూర్ మధ్య నడిచే హరిప్రియ 17415/16)
- ముంబయి–నాగర్‌సోయిల్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ (16351)

కొత్త నేర చట్టాలపై సమీక్ష జరగాలి


నూతన నేర చట్టాల అమలును నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయచోటి అర్బన్ : పార్లమెంటులో ఎలాంటి చర్చ లేకుండానే కేంద్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం అమలులోకి తీసుకువచ్చిన నేర చట్టాలపై వెంటనే సమీక్ష జరగాలని డిమాండ్ చేస్తూ రాయచోటికి చెందిన న్యాయవాదులు బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. నూతన నేర చట్టాల అమలును నిరసిస్తూ న్యాయవాదులు తమ కోర్టు విధులను బహిష్కరించారు. అనంతరం ఐఏఎల్ ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్, రాయచోటి బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి పాగయేపిల నేతృత్వంలో న్యాయవాదులు కలెక్టరేట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే జరిగిన సంఘటనపై పోలీసులు ప్రాథమిక విచారణ జరిపిన తర్వాత ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయవచ్చనే నిబంధన పెట్టడం దారుణమన్నారు. ఈ చట్టం ప్రకారం పోలీసులకు అపరిమిత అధికారాలు ఇచ్చినట్లే అన్నారు. రిమాండ్‌కు తరలించిన తర్వాత 15రోజుల వరకు పోలీస్ కస్టడీలోకి తీసుకునే సమయాన్ని 90 రోజులకు పొడిగించడం తగదన్నారు. ఈ కారణంగా ముద్దాయిలు చాలాకాలం జైళ్లలో మగ్గాల్సిన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. బ్రిటీషువారు తీసుకు వచ్చిన రాజద్రోహం చట్టాన్ని సుప్రీం కోర్టు రద్దు చేయగా కొత్తనేర చట్టాలలో దానిని మరింత బలోపేతం చేసి దేశద్రోహ చట్టంగా మార్చడం రాజ్యాంగంలోని భావ ప్రకటన స్వేచ్ఛ, జీవించే హక్కులను కాలరాయడమే అన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ధనుంజయకుమార్, చిన్నయ్య, ఆనంద్‌కుమార్, హుమయూన్‌బాషా, రవిశంకర్, ఖాదర్‌బాషా, నిరంజన్, ఖీజర్అలీ, ఉత్తేజ్‌కుమార్, చంద్రశేఖర్, నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం దుంగలు స్వాధీనం


దుంగలను స్వాధీనం చేసుకున్న అటవీ పోలీసులు

రాజంపేట : శేషాచలం అటవీ ప్రాంతంలో దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలను అటవీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీశాఖాధికారి నాగమణేశ్వరి ఆదేశాల మేరకు అటవీ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రాజంపేట రేంజ్ పరిధిలోని అరిమానపెంట, బీడుబావి పరిధిలో అటవీ పోలీసులు, బేస్‌క్యాంప్ ప్రొటెక్షన్ సిబ్బంది మంగళవారం కూంబింగ్ నిర్వహించారని రేంజర్ ఆర్.నారాయణ విలేకరులకు తెలిపారు. బీడుబావి బీట్‌లోని ఎర్రమద్ది ప్రదేశంలో తనిఖీలు చేస్తుండగా పొదలచాటున దాచిపెట్టిన 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి బరువు 354 కేజీలు ఉందన్నారు. వీటి విలువ రూ.1లక్షగా నిర్ధారించామన్నారు. కూంబింగ్‌లో ఎఫ్ఎస్ఓ ఎ.లింగారెడ్డి, బీట్ పి.సుబ్బరాయుడు, పి.జగన్(వత్తలూరు), బీడుబావి బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు

గొట్లమిట్ట సమీపంలో చిరుత సంచారం

చక్రాయపేట : వైఎస్ఆర్ ,అన్నమయ్య జిల్లాల సరిహద్దులో ఉన్న మండలంలోని గొట్లమిట్ట సమీపంలో బుధవారం రాత్రి 9–30 గంటల సమయంలో చిరుత కనిపించినట్లు గంగారపువాండ్లపల్లె సర్పంచ్ నాగరత్నమ్మ భర్త మల్‌రెడ్డి తెలిపారు. కొర్లకుంటకు చెందిన బండెన్న స్వామి ఆలయ పూజారి సుమో వాహనంలో వైఎస్సార్ జిల్లా చక్రాయపేట వైపు నుంచి కొర్లకుంటకు వెళుతుండగా ప్రధాన రహదారిపై వారికి రోడ్డుకు అడ్డుగా వచ్చిందన్నారు. వారు హారన్ కొట్టడంతో అది గొట్లమిట్ట, ఎద్దులవాండ్లపల్లె వైపున ఉన్న గుట్టల్లోకి వెళ్లినట్లు చెప్పారు. వెంటనే విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. చిరుత సంచారం విషయం తెలుసుకున్న ప్రజలు పొలాల్లోకి వెళ్లాలంటే భయపడుతున్నారు. నూలివీడు, చక్రాయపేటల మధ్య ద్విచక్రవాహనాల్లో రాత్రి పూట వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న నరసింహులు

వాల్మీకిపురం : పుంగనూరుకు చెందిన నరసింహులు (40) అనే వ్యక్తి వాల్మీకిపురం కొత్త ఇందిరమ్మ కాలనీ సమీపంలో రైల్వేగేటు వద్ద ఉన్న ఓ చెట్టుకు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పశువుల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగేశ్వర రావు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలంలో దొరికిన ఫోన్ ఆధారంగా మృతి చెందిన వ్యక్తి నరసింహులు అని, అతనిది పుంగనూరు అని వివరాలు తెలుసుకొని, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు


గాయపడిన చిన్నారి దుర్గాప్రసాద్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలో చిలంకూరు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ అనే చిన్నారిపై బుధవారం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిలంకూరు గ్రామం పరిధిలోని ఎర్రగుంట్ల రోడ్డులో ధోబీ ఘాట్ ఎదురుగా ఉన్న కాలనీలోని దుర్గాప్రసాద్ తల్లిదండ్రులు నివాసముంటున్నారు. బుధవారం ఉదయం బాలుడి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకునేందుకు బయటకు వెళ్లారు. అయితే దుర్గాప్రసాద్ ఆడుకునేందుకు బయటకు వచ్చాడు. సమీపంలోని దాబా వద్ద ఉన్న కుక్కలు ఒక్కసారిగా దుర్గాప్రసాద్‌పై దాడి చేసి ముఖం, చెవి, చేతులు, కాళ్లపై విపరీతంగా కరిచాయి. వెంటనే స్థానికులు కుక్కలను అదిలించి గాయపడిన బాలుడిని చిలంకూరు పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యాధికారి డాక్టర్ సాయిచరితరెడ్డి బాధితుడికి వ్యాక్సిన్ వేసి వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు వైద్యాధికారి తెలిపారు.

కటింగ్ మిషన్ కాలిపై పడి తీవ్ర గాయాలు

మదనపల్లె : కటింగ్ మిషన్ కాలిపై పడి గ్రానైట్స్ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని వీవర్స్ కాలనీలో నివసిస్తున్న మోర్ సింగ్ కుమారుడు భూప్ సింగ్ (18) ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి నివసిస్తున్నాడు. గ్రానైట్స్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం పట్టణంలోని నక్కలదిన్నెలో పనిలో భాగంగా గ్రానైట్‌ను మిషన్‌తో కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలిపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చింత కొమ్మ మీద పడి మరొకరికి..

చింత కొమ్మ మీద పడి వ్యక్తి గాయపడిన సంఘటన చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలంలో జరిగింది. కరసనపల్లె పంచాయతీ బట్టందొడ్డికి చెందిన గంగయ్య కుమారుడు వెంకటరమణ (50) పశువులను తోలుకొని పొలం వద్దకు వెళుతుండగా, మార్గమధ్యంలో చింతచెట్టు కొమ్మ విరిగి అతనిపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వరకట్న వేధింపులపై కేసు

మదనపల్లె : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ రేగంటివారిపల్లెకు చెందిన రాధమ్మ కుమార్తె నాగమణి(22) డిగ్రీ వరకు చదువుకుంది. ఆమెకు తిరుపతికి చెందిన సత్యనారాయణ వరలక్ష్మి దంపతుల కుమారుడు యశ్వంత్‌కుమార్(25)తో మూడు నెలల క్రితం వివాహం జరిగింది. అతను ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడు. పెళ్లి అయినప్పటి నుంచి భార్యభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో భర్త యశ్వంత్‌కుమార్‌తో పాటు తల్లిదండ్రులు నాగమణిని వేధించడం ప్రారంభించారు. అదనంగా మరో లక్ష కట్నంగా తేవాలని వేధించాడు. దీంతో నాగమణి పుట్టింటికి చేరుకుని అత్తింటి వారి వేధింపులపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె భర్త యశ్వంత్‌కుమార్, మామ సత్యనారాయణ అత్త వరలక్ష్మి లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ రవికుమార్ తెలిపారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం

నందలూరు : రాజంపేట సబ్ డివిజన్‌లోని నందలూరు, చిట్వేలి, రాజంపేట అర్బన్ పోలీస్ స్టేషన్ లలో నమోదైన 27 కేసుల్లో సీజ్ చేసిన రూ. 71,753 విలువచేసే 472 మద్యం బాటిళ్లను రాజంపేట సబ్ డివిజన్ పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్ కమల్, ఎస్ఈబీ ఈఎస్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాజంపేట సబ్ డివిజన్‌లో నమోదైన కేసులలోని సీజ్ చేసిన మద్యాన్ని మండలంలోని మూసివేసిన ఆల్విన్ ఫ్యాక్టరీ సమీపంలో జేసీబీ ద్వారా నేలమట్టం చేశారు. ఈ కార్యక్రమంలో నందలూరు, రాజంపేట, చిట్వేలి, ఎస్ఐలు అబ్దుల్ జహీర్, వెంకటేశ్వర్లు, సుధాకర్, ఏఎస్ఐ శంకర్ నాయక్, పాస్‌పోర్ట్ ఎంక్వైరీ అధికారి రాజా, వీఆర్ఓ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

వేంపల్లె : స్థానిక ప్రియాతోట వీధిలో మహమ్మద్ అనే వ్యక్తిపై స్వామినాథ్ అనే వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. సీఐ చాంద్‌బాషా కథనం మేరకు.. ప్రియాతోట వీధికి చెందిన మస్తాన్‌వలీ, స్వామినాథ్‌ల మధ్య కుటుంబ కలహాలు ఉండేవి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి స్వామినాథ్ మద్యం సేవించి మస్తాన్‌వలీ, అతని జేజి ఖాజాబీలను అసభ్య పదజాలంతో దూషిస్తుండగా మస్తాన్‌వలీ సోదరుడు మహమ్మద్ అడ్డుకున్నాడు. దీంతో అతనిపై కత్తితో దాడికి యత్నించగా మస్తాన్‌వలీ అడ్డుకున్నాడు. ఈ క్రమంలో అతని ఎడమ చేతిపై మూడు కత్తిపోట్లు పడ్డాయి.

న్యాయం కోసం వెళితే పోలీసులు చితకబాదారు

- ప్రెస్‌క్లబ్‌లో లా స్టూడెంట్ ఆవేదన
- బాధితుడికి మద్దతు తెలిపిన సీపీఐ నాయకులు



కలకడ స్టేషన్‌లో జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న బాధితుడు నాగేశ్వరనాయుడు

మదనపల్లె : భూ వివాదంలో న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఓ న్యాయవాద విద్యను అభ్యసిస్తున్న యువకుడిని, వెంట వెళ్లిన న్యాయవాది సమక్షంలోనే పోలీసులు చితకబాదిన ఘటన కలకడ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. బుధవారం బాధితుడు సీపీఐ నాయకులతో కలిసి మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఆవేదన వ్యక్తం చేశాడు. కలకడ మండలం ఎనుగొండ పాళ్యం గ్రామం గుండావాండ్లపల్లె సర్వే నంబర్.772/ఎలోని 12.30 ఎకరాల భూమిలో కదిరాయచెరువుకు చెందిన దిండుకుర్తి సూర్యనారాయణశెట్టి వద్ద 1991లో నాలుగు ఎకరాల సెటిల్‌మెంట్ వ్యవసాయభూమిని టి.నాగప్ప నాయుడు కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకున్నారు. మొత్తం 12.30 ఎకరాల భూమిలో రోడ్డుకు పోనూ 4 ఎకరాల భూమిని రిజిస్టర్ చేసుకుని, పాసుపుస్తకాలు కలిగి ఉండటమే కాకుండా ఆన్‌లైన్, వెబ్‌ల్యాండ్‌లో నమోదై, సర్వహక్కులు కలిగి వ్యవసాయం చేసుకుంటున్నారు. మిగిలిన భూమిలో రైతు జయన్న 2 ఎకరాలు, రెడ్డెప్ప 5.5 ఎకరాలు కొనుగోలు చేశారు. నాగప్ప నాయుని భూమి పక్కనే ఉన్న మూడు ఎకరాల వ్యవసాయ భూమిని బత్తల చిన్నప్ప కొనుగోలు చేశాడు. ఇతడు తన భూమితో పాటుగా నాగప్పనాయుడుకి చెందిన నాలుగు ఎకరాల భూమిలోకి ప్రవేశించి, ఒక ఎకరాకు పైగా భూమిని కబ్జా చేశాడు. ఈ విషయమై పలుమార్లు కలకడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, మూడుసార్లు సర్వే చేయించినా కబ్జా చేసిన భూమిని విడిపించలేకపోయారు. దీంతో తన భూమిని కాపాడుకునేందుకు నాగప్పనాయుడు రాతికూసాలు నాటేందుకు ప్రయత్నిస్తే చిన్నప్ప అడ్డుకోవడమే కాకుండా భూమిని దుక్కి దున్నేందుకు ప్రయత్నించి, పొలంలోకి ఆవులను తీసుకువచ్చి మేపసాగాడు. దీంతో నాగప్పనాయుడు 100 పోలీస్ నెంబర్‌కు ఫోన్‌చేస్తే, పోలీసులు పొలం వద్దకు వచ్చి ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు రావాల్సిందిగా కోరారు. దీంతో తండ్రి నాగప్ప నాయుడు, కుమారుడు నాగేశ్వరనాయుడులు, న్యాయవాది రఫీని తీసుకుని కలకడ స్టేషన్‌కు వెళ్లి సీఐ శ్రీనివాస్‌కు జరిగిన విషయం చెప్పి, కబ్జాదారులపై కేసు నమోదు చేయాల్సిందిగా కోరారు. అయితే, పోలీసులు బాధితుడి ఫిర్యాదును పట్టించుకోకపోగా, పలుమార్లు భూవివాదంలో స్టేషన్‌కు వస్తున్నావని, నాగేశ్వరనాయుడు సెల్‌ఫోన్ లాక్కుని, చేయి చేసుకోవడమే కాకుండా భయపెట్టారు. దీంతో బాధితుడు అక్కడి నుంచి వచ్చేసి, మదనపల్లెలోని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు సాంబశివ తదితరులను కలిసి న్యాయం చేయాల్సిందిగా కోరాడు. తనపై అకారణంగా దాడిచేసిన పోలీస్ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. ఇరువర్గాల మధ్య భూవివాదం తలెత్తకుండా రెవెన్యూ అధికారులు సరిహద్దులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.